అక్షరశక్తి
The Power of Pen
Evening Daily

## పరకాల నుంచి పోటీ చేసేది నేనే..!

- టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా..
- రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఎలా ప్రకటిస్తారు?
- కొండా సురేఖ కూతురు సుష్మితాపటేల్ సంచలన వ్యాఖ్యలు



4

సంపుటి: 20 | సంచిక: 287 | వరంగల్ | బుధవారం, 19 ఆగస్టు 2026 | పేజీలు: 06

# ఇంకా మీరేనా?

## రాజకీయాల్లో వృద్ధ నేతలు

- వృద్ధాప్యం వెంటాడుతున్నా తీరని అధికార దాహం
- పదవులపై వీడని వ్యామోహం
- యువతను తొక్కిపడేస్తున్న నేతలు
- రేవూరికే మళ్లీ టికెట్ ప్రకటనపై యువతలో తీవ్ర అసంతృప్తి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపైనా..!

వృద్ధాప్యం వెంటాడుతున్నా.. పలువురు నేతలకు అధికార దాహం తీరడం లేదు.. పదవులపై వ్యామోహం పోవడం లేదు.. నోరు తెరిస్తే.. యువత రాజకీయాల్లో రావాలి.. అంటూ ప్రసంగాలు దంచుతూనే ఉంటారుగానీ.. సందుమాత్రం పెట్టరు..! దశాబ్దాలుగా అధికారాన్ని, పదవులను అనుభవిస్తూ వస్తున్నారు. గానీ.. యువతకు మాత్రం అవకాశాలు దక్కనీయడం లేదు. ఇదే చివరిసారి..అంటూ మళ్లీ పోటీ చేస్తున్నారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరిలాంటి వృద్ధ నేతల తీరుపై నేటి యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొంటోంది. ఇటీవల పరకాల సభలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలంటూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడంపై యువత తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. 80 ఏళ్ల వయస్సులోనూ మీరేనా.. అంటూ యువనాయకులు లోలోపల ఆగ్రహం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీనే నమ్ముకొని ఏళ్లుగా జెండా మోస్తున్న యువతరానికి అవకాశాలు ఇంకెప్పుడు..? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. - అక్షరశక్తి, ప్రధానప్రతినిధి



3

# తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ ఆవిర్భావం

**రాష్ట్ర అధ్యక్షుడిగా ఆరెల్లి కిరణ్ కార్యదర్శిగా పల్లెబోయిన నాగరాజు ○ కోశాధికారిగా పల్లె రవి వంశీ మోహన్**

తెలంగాణ డిజిటల్ మీడియా జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ (టీడీఎంయూ) నూతనంగా ఆవిర్భవించింది. యూనియన్‌కు రిజిస్ట్రేషన్ నంబర్ 468/2026గా నమోదైంది.టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడిగా అరెల్లి కిరణ్, రాష్ట్ర కార్యదర్శిగా పల్లెబోయిన నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా కౌడగాని మోహన్‌రావు, కోశాధికారిగా పల్లె వంశీ మోహన్, సహాయ కార్యదర్శిగా బూర నగేష్ గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, గౌరవ సలహాదారుగా రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దాసరి ధనుంజయ, సలేంద్ర రవీందర్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న డిజిటల్ మీడియా జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువచ్చి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. డిజిటల్ మీడియా ప్రతినిధుల హక్కుల పరిరక్షణతో పాటు వృత్తిపరమైన అభివృద్ధి, సంక్షేమం కోసం యూనియన్ నిరంతరం పనిచేస్తుందని పేర్కొన్నారు.డిజిటల్ మీడియా రంగం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో జర్నలిస్టులకు ఎదురవుతున్న సమస్యలను సంబంధిత ప్రభుత్వ విభాగాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా యూనియన్‌ను బలోపేతం చేసి డిజిటల్ మీడియా జర్నలిస్టుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు. - అక్షరశక్తి,హైదరాబాద్

2



ఆరెల్లి కిరణ్



నాగరాజు



వంశీ మోహన్

## కేయూ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా
# మొక్కలు నాటిన విద్యార్థులు





**అక్షరశక్తి,కేయూ క్యాంపస్:** కాకతీయ విశ్వవిద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాలన మరియు మానవ వనరుల విభాగం ఆధ్వర్యంలో విస్తృతంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మానవీయ శాస్త్ర భవనం ఆవరణలో విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 2019 నుంచి విభాగం ఆవరణలో విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులతో మొక్కలు నాటించడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. 2019 నుంచి "ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటండి.. సెల్ఫీ దిగండి.. సంతకం చేయించుకోండి" అనే నినాదంతో విభాగం ఆవరణలో అనేక మొక్కలు నాటించినట్లు ఆయన పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడంతో పాటు మొక్కల సంరక్షణను ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డా. ఆకుతోట శ్రీనివాసులు, డా. చీకటి శ్రీను, డా. బుర్రి ఉమాశంకర్, నాగేశ్వరరావు, దామెర దేవదాసు, మాదారపు సురేష్, నక్క చేరాలు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్లకు ఘన సన్మానం....



**అక్షరశక్తి, హనుమకొండ:** ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఫోటో జర్నలిస్టులను ఘనంగా సన్మానించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫోటో జర్నలిస్టులను శాలువాతో సన్మానించి మెమోంటో అందించటంతో పాటుగా ప్రతీ ఫోటో జర్నలిస్టుకు 2,000/ రూపాయల నగదు పారితోషికాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, ఉపాధ్యక్షులు గొకారపు శ్యాం, కొడిపెల్లి దుర్గాప్రసాదరావు, జాయింట్ సెక్రెటరీలు పొడిచెట్టి విష్ణువర్ధన్, వలిశెట్టి సుధాకర్, సంపెట సుధాకర్, కార్యవర్గ సభ్యులు వీరగోని హరీష్, ఎండీ నయింపాషా, ఫోటో గ్రాఫర్లు దాసరి శ్రీనివాస్, మంగనూరి మురళి,గొట్టె వెంకన్న, చేతి శ్రీనివాస్, కుడుతుల రమేష్, మాషూక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఏ తెలుగు కోర్సు స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

**అక్షరశక్తి, వరంగల్:** హంటర్ రోడ్ లోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో 20262027 సంవత్సరానికి ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సులో స్పాట్ అడ్మిషన్లు పొందడానికి ఈ నెల 26 వరకు గడువు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 99891 39136, 99894 17299, సెల్ నెంబర్ల ద్వారా సంప్రదించాలని సూచించారు.

# డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు కల్పించాలి

- ప్రత్యేక అక్రిడిటేషన్.. రక్షణ, సంక్షేమం అందించాలి
- దాడులు, బెదిరింపులపై ప్రత్యేక రక్షణ వ్యవస్థ ఉండాలి
- ప్రభుత్వం ప్రత్యేక డిజిటల్ మీడియా పాలసీ తీసుకురావాలి
- రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులను ఏకతాటిపైకి తెస్తాం
- టీడీఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్
- సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి: కార్యదర్శి నాగరాజు
- తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ ఆవిర్భావం



**అక్షరశక్తి, హనుమకొండ:** డిజిటల్ మీడియా జర్నలిస్టులకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులతో సమానంగా హక్కులు, గుర్తింపు, రక్షణ, సంక్షేమం కల్పించాలని తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్ అధ్యక్షుడు అరెల్లి కిరణ్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. డిజిటల్ మీడియా విస్తరిస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల హక్కులు, బాధ్యతలు, సంక్షేమాన్ని స్పష్టంగా నిర్వచించేలా ప్రత్యేక డిజిటల్ మీడియా పాలసీని తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న డిజిటల్ మీడియా ప్రతినిధులను ఏకతాటిపైకి తీసుకొచ్చి వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల పరిరక్షణకు యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు.

**టీడీఎంయూ రాష్ట్ర కార్యవర్గం**

తెలంగాణ డిజిటల్ మీడియా యూనియన్(టీడీఎంయూ)కు సంబంధించిన రిజిస్ట్రేషన్ (రిజిస్ట్రేషన్ నంబర్ 468 ఆఫ్ 2026) ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో సభ్యులు నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా అరెల్లి కిరణ్, కార్యదర్శిగా పల్లెబోయిన నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.యూనియన్ ఉపాధ్యక్షుడిగా కౌడగాని మోహన్‌రావు, కోశాధికారిగా పల్లె వంశీ మోహన్, సహాయ కార్యదర్శిగా బూర నగేష్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడిగా గడ్డం కేశవమూర్తి, గౌరవ సలహాదారుగా రాజేశ్వరరావు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దాసరి ధనుంజయ, సలేంద్ర రవీందర్ ఎంపికయ్యారు. ఈసందర్భంగా అధ్యక్షుడు కిరణ్ గౌడ్ మాట్లాడుతూ డిజిటల్ మీడియా జర్నలిస్టుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేస్తుందని వారు తెలిపారు. డిజిటల్ పేపర్లలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులకు ప్రత్యేక నిబంధనలతో అక్రిడిటేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డిజిటల్ జర్నలిస్టులకు ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రెస్‌కాన్ఫరెన్సులు, అధికారిక సమావేశాలు, కలెక్టరేట్లు, పోలీస్, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో వార్తా సేకరణకు సమాన అవకాశం కల్పించాలన్నారు. గుర్తింపు కార్డు కేవలం గుర్తింపునకు మాత్రమే కాకుండా విధి నిర్వహణలో రక్షణకు ఉపయోగపడేలా వ్యవస్థ ఉండాలని కోరారు.

**దాడులు.. బెదిరింపులపై రక్షణ**

అవినీతి, అక్రమాలు, మాఫియా, నేరాలు, ప్రజా సమస్యలపై వార్తలు రాసే డిజిటల్ జర్నలిస్టులు పలు చోట్ల బెదిరింపులు, దాడులు, ఆన్‌లైన్ వేధింపులు ఎదుర్కొంటున్నారని కిరణ్ గౌడ్ తెలిపారు. విధి నిర్వహణలో జర్నలిస్టులపై దాడులు జరిగితే వెంటనే స్పందించేలా ప్రతి జిల్లాలో ప్రత్యేక నోడల్ అధికారి లేదా హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని కోరారు. జర్నలిస్టులపై విధి నిర్వహణకు సంబంధించిన కేసులు నమోదైనప్పుడు చట్టపరమైన సహాయం అందించేందుకు ప్రత్యేక లీగల్ ఎయిడ్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు. జర్నలిస్టులకు సురక్షిత పని వాతావరణం కల్పించడంతోపాటు సైబర్ వేధింపులు, ట్రోలింగ్, బెదిరింపులపై వేగంగా చర్యలు తీసుకునే విధానం అవసరమన్నారు.

**డిజిటల్ మీడియాకు ప్రత్యేక పాలసీ**

డిజిటల్ మీడియా కేవలం సోషల్ మీడియా కాదని, వార్తా సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, ప్రచురణలో వృత్తిపరమైన ప్రమాణాలతో పనిచేస్తున్న జర్నలిజం విభాగమని కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. డిజిటల్ జర్నలిస్టుల గుర్తింపు, రక్షణ, సంక్షేమానికి ప్రత్యేక విధానం రూపొందించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఫ్యాక్ట్ చెకింగ్, ఏఐ టెక్నాలజీ, డేటా జర్నలిజం, డిజిటల్ ఫోరెన్సిక్స్, క్రైమ్, ఎన్నికల కవరేజీ తదితర అంశాల్లో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు, సమాన గుర్తింపు, సమాన రక్షణ, సమాన సంక్షేమం కల్పించడమే యూనియన్ లక్ష్యమని స్పష్టం చేశారు. డిజిటల్ మీడియా కేవలం సోషల్ మీడియా కాదని, వార్తా సేకరణ, వాస్తవ నిర్ధారణ, విశ్లేషణ, ప్రచురణలో వృత్తిపరమైన ప్రమాణాలతో పనిచేస్తున్న జర్నలిజం విభాగమని కిరణ్ గౌడ్ పేర్కొన్నారు. డిజిటల్ జర్నలిస్టుల గుర్తింపు, రక్షణ, సంక్షేమానికి ప్రత్యేక విధానం రూపొందించాలన్నారు. సైబర్ సెక్యూరిటీ, ఫ్యాక్ట్ చెకింగ్, ఏఐ టెక్నాలజీ, డేటా జర్నలిజం, డిజిటల్ ఫోరెన్సిక్స్, క్రైమ్, ఎన్నికల కవరేజీ తదితర అంశాల్లో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డిజిటల్ జర్నలిస్టులకు సమాన హక్కులు, సమాన గుర్తింపు, సమాన రక్షణ, సమాన సంక్షేమం కల్పించడమే యూనియన్ లక్ష్యమని స్పష్టం చేశారు.

**సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి : కార్యదర్శి నాగరాజు**

ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య, సంక్షేమ పథకాలకు అర్హులైన డిజిటల్ జర్నలిస్టులను కూడా చేర్చాలని కార్యదర్శి నాగరాజు కోరారు. ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, అత్యవసర వైద్య సహాయం, విధి నిర్వహణలో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థిక సాయం, పిల్లల విద్యకు తోడ్పాటు వంటి సంక్షేమ చర్యలు అందించాలన్నారు. దీర్ఘకాలంగా జర్నలిజంలో కొనసాగుతున్న వారికి వృద్ధాప్య సామాజిక భద్రత, అర్హులైన వారికి గృహ వసతి, ఇళ్ల స్థలాల కేటాయింపులో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

**అక్షరశక్తి,వరంగల్:** సెప్టెంబర్ 12న వరంగల్ జిల్లా కోర్టు, నర్సంపేట కోర్టుల్లో నిర్వహించనున్న 3వ జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి. నిర్మలా గీతాంబ కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, వివాహ, కుటుంబ వివాదాలు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, చెక్ బౌన్స్, బ్యాంకు, చిట్ ఫండ్, ఎక్సైజ్, విద్యుత్ తదితర కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు వరంగల్




జిల్లాలో 651 రాజీపడదగిన క్రిమినల్ పెండింగ్ కేసులకు సంబంధించి కక్షిదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. పోలీసు అధికారులు రాజీకి అనుకూలమైన కేసులను గుర్తించి, లోక్ అదాలత్ ప్రయోజనాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు. న్యాయవాదులు, పోలీసు అధికారులు, న్యాయాధికారులు సమన్వయంతో పనిచేస్తే అధిక సంఖ్యలో కేసులను రాజీ ద్వారా పరిష్కరించవచ్చన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ పోలీస్ శాఖ పరిధిలోని రాజీకి అనుకూలమైన కేసులను గుర్తించి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా పరిష్కరించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సమావేశంలో వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సి.హెచ్. ఉపేందర్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. సహోదర్ రెడ్డి, న్యాయమూర్తులు, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, కోర్టు కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంకా మీరేనా..?





- రాజకీయాల్లో వృద్ధ నేతలు
- వృద్ధాప్యం వెంటాడుతున్నా తీరని అధికార దాహం
- పదవులపై వీడని వ్యామోహం
- యువతను తొక్కిపడేస్తున్న నేతలు
- రేవూరికే మళ్లీ టికెట్ ప్రకటనపై యువతలో తీవ్ర అసంతృప్తి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపైనా..!

**అక్షరశక్తి, ప్రధానప్రతినిధి:** వృద్ధాప్యం వెంటాడుతున్నా.. పలువురు నేతలకు అధికార దాహం తీరడం లేదు.. పదవులపై వ్యామోహం పోవడం లేదు.. నోరు తెరిస్తే.. యువత రాజకీయాల్లో రావాలి.. అంటూ ప్రసంగాలు దంచుతూనే ఉంటారుగానీ.. సందుమాత్రం పెట్టరు..! దశాబ్దాలుగా అధికారాన్ని, పదవులను అనుభవిస్తూ వస్తున్నారు. గానీ.. యువతకు మాత్రం అవకాశాలు దక్కనీయడం లేదు. ఇదే చివరి సారి..అంటూ మళ్లీ పోటీ చేస్తున్నారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరిలాంటి వృద్ధ నేతల తీరుపై నేటి యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొంటోంది. ఇటీవల పరకాల సభలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మళ్లీ గెలిపించాలంటూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడంపై యువత తీవ్ర అసహనం వ్యక్తం చేస్తోంది. 80 ఏళ్ల వయస్సులోనూ మీరేనా.. అంటూ యువనాయకులు లోలోపల ఆగ్రహం చెందుతున్నారు. ఈ నేపథ్యంలో పార్టీనే నమ్ముకొని ఏళ్లుగా జెండా మోస్తున్న యువతరానికి అవకాశాలు ఇంకెప్పుడు..? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి.

**రేవూరి రాజకీయ ప్రస్థానం**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ రాజకీయ నాయకుడిగా గుర్తింపు పొందిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం తెలుగుదేశం పార్టీతో ప్రారంభమైంది. నర్సంపేట నియోజకవర్గం నుంచి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఆ ప్రాంత రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారు. 1994, 1999, 2009 ఎన్నికల్లో నర్సంపేట నుంచి విజయం సాధించారు. టీడీపీ హయాంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో కీలక నేతగా ఎదిగిన ఆయన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. 2014లో నర్సంపేట నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి దొంతి మాధవరెడ్డి చేతిలో ఓటమి చెందారు. 2018లో టీడీపీకాంగ్రెస్ పొత్తులో భాగంగా వరంగల్ పశ్చిమ నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆ ఎన్నికల్లో దాస్యం వినయ్‌భాస్కర్ చేతిలో ఓడిపోయారు. 2019లో టీడీపీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మరో కీలక మలుపు చోటుచేసుకుంది. బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరిన రేవూరికి పరకాల నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టికెట్ లభించింది. 2023 ఎన్నికల్లో పరకాల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రేవూరి ప్రకాశ్‌రెడ్డి 72,573 ఓట్లు సాధించి బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిపై 7,941 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన పరకాల ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు.

**కడియం రాజకీయ ప్రస్థానం**

కడియం శ్రీహరి 1987లో తెలుగుదేశం పార్టీ ద్వారా క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఎన్టీ రామారావు సూచనతో రాజకీయాల్లో అడుగుపెట్టిన ఆయన తొలుత వరంగల్ జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1988లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. 1994లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. పలు శాఖలకు మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఓటమి ఎదురైనా, 2008 ఉప ఎన్నికల్లో తిరిగి విజయం సాధించారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరిన కడియం శ్రీహరి 2014లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. 2015లో కేసీఆర్ మంత్రివర్గంలో ఉప ముఖ్యమంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 2015-2021 మధ్య తెలంగాణ శాసన మండలి సభ్యుడిగా కొనసాగారు. 2021లో మరోసారి ఎమ్మెల్యేల కోటా నుంచి శాసన మండలికి ఎన్నికయ్యారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. తీరా పార్లమెంట్ ఎన్నికల్లో అనూహ్యంగా కూతురు కడియం కావ్య కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

**వృద్ధాప్యం వెంటాడుతున్నా...**

కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డిని వృద్ధాప్యం వెంటాడుతున్నా.. అధికార దాహం మాత్రం తీరడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ హయాంలో యువనాయకులుగా అవకాశాలు పొందిన వీరు.. నేటి యవతకు మాత్రం అవకాశాలు దక్కనీయడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దశాబ్దాలుగా అనేక పార్టీ పదవులు, ప్రభుత్వ పదవులు అనుభవిస్తున్నా.. అనేక ఏళ్లుగా జెండాలు మోస్తున్న యువతరానికి మాత్రం సందుపుట్టనీయడంలేదనే విమర్శలు వచ్చిపడుతున్నాయి. ఇదే చివరిసారి.. అంటూ మళ్లీ వారే పోటీ చేస్తుండడంపై తీవ్ర అసంతృప్తి నెలకొంటోంది. ఇద్దరూ సుమారు 80 ఏళ్ల వయస్సుకు చేరువలో ఉన్నారని, అయినా.. మళ్లీ రేవూరినే గెలిపించాలని స్వయంగా రేవంత్‌రెడ్డి పిలుపునివ్వడంపై సర్వత్రా చర్చనీయాంశంగా మారుతోంది.

# ఎల్ నినో అవగాహన కార్యక్రమాలు





**అక్షరశక్తి,ములుగు:** ఎల్ నినో ప్రభావంతో వచ్చే రెండు నెలలు నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలైన కూరగాయలు పప్పు దినుసులు, పండ్ల తోటలు సాగు చేయాలని ఆత్మ ఆధ్వర్యంలో బుధవారం ములుగు జిల్లా మల్లంపల్లి మండల కేంద్రంలోని పలు పంటలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుతాడి పంటలు వేసుకోవాలని కూరగాయల విత్తనాలు మల్చింగ్ డ్రిప్ ఇరిగేషన్ మీద పద్ధతులలో సబ్సిడీలపై రైతులకు ఉద్యాన శాఖ ద్వారా సబ్సిడీలు రైతులకు అందజేయబడతాయని ఆయన అన్నారు. రైతులకు అవగాహన కార్యక్రమాలతో పాటు కూరగాయలు ఆయిల్ ఫామ్ పత్తి పంటలను మిర్చి నారుమడులను బంతిపూల తోటలను పలు రైతుల పంటలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేయడం జరిగింది. రైతులకు సబ్సిడీ వివరాలు చెప్పడంతోపాటు కాంపౌండ్స్ మల్చింగ్ శాశ్వత పందిర్లు వర్మి కంపోస్టు బిందు సేద్యం తుంపర పరికరాల గురించి రైతులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విశ్వతేజ, జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్, ఉద్యానవనాధికారి సంజీవరావు స్థానిక వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాధితురాలికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



**అక్షరశక్తి, గూడూరు :** మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీయక్ చొరవతో గూడూరు గ్రామపంచాయతీకి చెందిన ఆలకుంట్ల కొమరమ్మకు రూ.60వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ అందించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ చంటి స్వామి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండి రసూల్, గూడూరు టౌన్ కార్యదర్శి సూర శ్రీను, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలమందల శ్రీనివాస్, తంగళ్ళపల్లి సునీల్, పేరాల సురేందర్, మైనార్టీ నాయకులు కరీం పాషా, అమరాజుల సాంబయ్య, ఓర్సు సూరయ్య, రాజేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబాలకు అండగా పీఆర్ ముదిరాజ్ సేవా సమితి



**అక్షరశక్తి,దుగ్గొండి:** దుగ్గొండి మండలం తిమ్మంపేట గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి భూమ సమ్మక్క అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి గ్రామ బాధ్యులు సోనబోయిన రాజు, జట్టబోయిన రాజు సూచనల మేరకు రాష్ట్ర నాయకులు పులి సదానందం, వరంగల్ జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్, మండల బాధ్యులు జటబోయిన రాజేందర్ ఆధ్వర్యంలో స్థానిక ముదిరాజ్ కుల పెద్దల సమక్షంలో బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్ మాట్లాడుతూ ముదిరాజులు ఆర్థికంగా ఎదిగి, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ దానధర్మాల్లో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షుడు ఓరుగంటి తిరుపతి, మండల అధ్యక్షుడు జటబోయిన రాజేందర్, గ్రామ అధ్యక్షుడు సోనబోయిన రాజు, గౌరవ సలహాదారు జట్టబోయిన రాజు, కుల పెద్దలు దండు నర్సయ్య, దండు రవి, తెప్ప రాంబాబు, బాషబోయిన సురేష్‌తో పాటు మేక నవీన్, మేక రాజయ్య, జట్టబోయిన రవి, బాషబోయిన వేణు, భూమ రంజిత్, సాంబయ్య, దండు సతీష్, మేక మల్లయ్య, బాషబోయిన నరేష్, దండు రమేష్, గంగరబోయిన నవీన్, దండు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కమిషనరేట్‌లో నలుగురు సీఐలకు బదిలీలు

**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నలుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా చేపట్టిన ఈ బదిలీలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీఆర్‌లో ఉన్న కె. ఫణీధర్‌ను నెక్కొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. నెక్కొండలో సీఐగా పనిచేస్తున్న ఎస్. శ్రీనివాస్‌ను వీఆర్‌కు బదిలీ చేశారు. అదేవిధంగా వీఆర్‌లో ఉన్న జె. శంకర్రావును నర్సంపేట రూరల్ -దుగ్గొండి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎం. సాయి రమణను వీఆర్‌కు బదిలీ చేశారు. నర్సంపేట డివిజన్‌లో బందోబస్తు విధులు పూర్తయిన అనంతరం సీఐలు సాయి రమణ, శ్రీనివాస్‌లను రిలీవ్ చేయాలని నర్సంపేట ఏసీపీని ఆదేశించారు. అలాగే ఫణీధర్, శంకర్రావులను వెంటనే రిలీవ్ చేసి, కొత్త పోస్టింగ్‌లలో విధుల్లో చేరి సంబంధిత అధికారులకు రిపోర్టు చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

# సాంకేతిక విద్యపై జీవో 97ను వెంటనే ఉపసంహరించుకోవాలి

**బీసీ ఇంటలెక్చువల్ ఫోరం హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్**



**అక్షరశక్తి,హనుమకొండ:** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన శక్తి (SHAKTI) విధానానికి సంబంధించిన జీవో నంబర్ 97ను వెంటనే ఉపసంహరించుకోవాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం హనుమకొండ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ జీవో వల్ల పాలిటెక్నిక్ (డిప్లొమా) విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు సాంకేతిక కళాశాలల ఉనికికే ముప్పు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. జీవో 97కు వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థి సంఘాలు ఇప్పటికే ఆందోళనలు, నిరసనలు చేపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఫోరం కోరింది. సాంకేతిక విద్యలో సంస్కరణలు తీసుకురావడానికి ముందు విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులు, సంబంధిత వర్గాలతో విస్తృతంగా చర్చించాలని సూచించింది. సాంకేతిక విద్యను బలోపేతం చేసే విధానాలను రూపొందించాల్సిన ప్రభుత్వం, కళాశాలలు మరియు విద్యార్థులకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకోకూడదని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం హనుమకొండ జిల్లా శాఖ స్పష్టం చేసింది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేసి, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే కొత్త సంస్కరణలను అమలు చేయాలని డిమాండ్ చేసింది.

## ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



**అక్షరశక్తి, గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో 187వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెమెరా సృష్టికర్త లూయిస్ మండే డాగురె చేసిన సేవలను గుర్తు చేసుకొని మండల అధ్యక్షులు బొజ్జ కరుణాకర్, ప్రధాన కార్యదర్శి మేరెడ్డి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు మండల కోశాధికారి చుంచకిరణ్, మానుకోట జిల్లా మాజీ రాష్ట్ర కార్యదర్శి అయినవోలు బాలచందర్, మాజీ గూడూరు మండల అధ్యక్షులు అయినవోలు శ్రీధర్ శర్మ, గౌరవాధ్యక్షులు బురగాని శ్రీరామ్, గౌరవ సలహాదారులు లాల్ సింగ్, గూడూరు మండల ఉపాధ్యక్షులు గోపగాని సురేష్, అజ్మీర విజయ్, ధారావత్ వీరన్న, సలీం, సమ్మెట స్వామి, రమేష్, పాషా, శరత్, అలీం, రాజేష్, నాగేల్లి స్వామి, ముఖేష్, గట్టు శీను తదితరులు పాల్గొన్నారు.

## ఆకుతోట రాజేందర్‌కు అక్షరశ్రీ పురస్కారం




**అక్షరశక్తి, మడికొండ :** హనుమకొండ జిల్లా మడికొండకు చెందిన సాహితీవేత్త ఆకుతోట రాజేందర్ తన రచనలతో సమాజంలో సామాజిక చైతన్యాన్ని నింపుతున్నందుకు గాను ప్రతిష్టాత్మక "అక్షరశ్రీ" పురస్కారం అందుకున్నారు. జాతీయ, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ "విశ్వసాహితి కళావేదిక" ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెంలో జరిగిన అక్షర వార్షికోత్సవాల సందర్భంగా ఈ అవార్డు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం చైర్మన్ పి. కాంతారావు రావు, విశ్వసాహితి కళావేదిక చైర్మన్ కొల్లి రమావతి చేతుల మీదుగా ఆకుతోట రాజేందర్ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ వేడుకకు ప్రముఖ గజల్ కవి గజల్ శ్రీనివాస్, ప్రముఖ గేయ రచయిత రసరాజు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని సభను సుశోభితం చేశారు. ఈ సందర్భంగా ఆకుతోట రాజేందర్‌కు స్థానికులు శుభాకాంక్షలు తెలిపారు.



# పరకాల నుంచి పోటీ చేసేది నేనే!

- **టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా..**
- **రేవూరి ప్రకాశ్‌రెడ్డికి టికెట్ ఎలా ప్రకటిస్తారు?**
- **కొండా సురేఖ కూతురు సుష్మితాపటేల్ సంచలన వ్యాఖ్యలు**



**అక్షరశక్తి, వరంగల్:** మంత్రి కొండా సురేఖ కుమార్తె సుష్మితా పటేల్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోతే పరకాల నుంచి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించారు. పరకాల నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుష్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. పరకాల నియోజకవర్గ రాజకీయాలపై సుష్మితా పటేల్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి అయిన తర్వాత రేవంత్ రెడ్డి వ్యవహారశైలిలో మార్పు వచ్చిందని అన్నారు. 'పొంగులేటి ముఖ్యమంత్రా.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రా? అసలు ఎవరు సీఎం అనేది అర్థం కావడం లేదు' అని సుష్మితా వ్యాఖ్యానించారు. సీఎం అయ్యాక.. కళ్లునెత్తికెక్కాయా..? అంటూ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేందుకు తన తండ్రి కొండా మురళీ కూడా సహకరించారని సుష్మితా పటేల్ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టే సమయంలో కొండా మురళీ సహకారం ఉందని అన్నారు. అందుకు ప్రతిఫలంగా కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ హామీ నెరవేర్చలేదని ఆరోపించారు. కొండా మురళీకి ఎమ్మెల్సీ పదవి ఇస్తానని హామీ ఇవ్వలేదని రేవంత్ రెడ్డి ఇక్కడి మైసమ్మపై ప్రమాణం చేయగలరా? అని సుష్మితా పటేల్ సవాల్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ మధ్య పోటీ జరుగుతోందని వ్యాఖ్యానించారు. రేవూరి ప్రకాశ్ రెడ్డికి పరకాల టికెట్ ఎలా ప్రకటిస్తారని సుష్మితా పటేల్ ప్రశ్నించారు. దమ్ముంటే రాజీనామా చేయించి ఇప్పుడే ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. తమ ఇలాఖాకు వచ్చి తమతో ఎందుకు పెట్టుకుంటున్నారని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన అవినీతిపై ఇప్పటివరకు రూ.200 కోట్ల వ్యవహారాన్ని మాత్రమే బయటపెట్టానని సుష్మితా పటేల్ ఆరోపించారు. తనపై కౌంటర్ ఇస్తే మరిన్ని విషయాలను బయటపెడతానని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల సమయానికి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉంటారో, ఉండరో కూడా సందేహమేనని సుష్మితా పటేల్ వ్యాఖ్యానించారు.

# పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

- **హైకోర్టు తీర్పును అమలు చేయాలి**
- **ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ, కలెక్టరేట్ ముందు ధర్నా**






**అక్షరశక్తి, ములుగు :** ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలో భూస్వామి సూరినేని మురళీధర్ రావు ఆక్రమించిన ప్రభుత్వ భూమి సర్వే నెంబరు 105లో ఉన్న 135 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ములుగు కలెక్టర్ కార్యాలయం ముందు అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్), సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో అరగంటసేపు ధర్నా చేశారు. ముందుగా ములుగు పట్టణంలోని డిఎల్ఆర్ ఫంక్షన్ హాల్ ప్రాంతం నుండి బస్టాండ్ మీదుగా కలెక్టర్ ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించారు ఈ ప్రదర్శనలో పాల్గొన్న న్యూ డెమోక్రసీ పార్టీ మరియు ఏఐకేఎంఎస్ నాయకులు భూస్వామి మురళీధర్ రావు ఆక్రమించిన ప్రభుత్వ భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోని పేదలకు పంచాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని ప్రజలపై భూస్వామి అనుచరులు చేస్తున్న ఆగడాల నుండి రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాను ఉద్దేశించి ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి మాట్లాడుతూ లక్ష్మీదేవి పేటలో పేద ప్రజలు ఇండ్ల స్థలాల కోసం గత 30 సంవత్సరాలకు పైగా పోరాడుతున్నారని ప్రభుత్వ భూమిలో వేసుకున్న గుడిసెలను భూస్వామి మురళీధర్ రావు పీకి వేసి సాగు భూమిగా మార్చుకొని పంటలు పండించుకుంటే ములుగు జిల్లా కోర్టులో కేసు వేయగా పేదలకు అనుకూలంగా తీర్పు వచ్చిందని హైకోర్టులో కూడా మురళీధర్ రావు ప్రభుత్వ ఆక్రమించుకున్నాడని తీర్పు ఇచ్చిందని ఈ తీర్పు అనుసారంగా అట్టి భూమిని పేదలకు పంచాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ధర్నా అనంతరం కలెక్టర్ ఆఫీసులో కలెక్టర్ అందుబాటులో లేనందున ములుగు ఆర్డీఓ కృష్ణవేణికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జక్కుల తిరుపతి రాచర్ల బాలరాజు ములుగు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు బొమ్మెడ సాంబయ్య కుర్రి ఐలయ్య పి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ ముంజాల బిక్షపతి ఐ ఎఫ్ టి యు జిల్లా నాయకులు బండి కుమార్‌లతోపాటు పార్టీ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు మరియు బంక బిక్షపతి శ్యామల రమేష్ ఝాన్సీ రమ లక్ష్మి చిరంజీవి రాజు సదానందం గుడిసెలు కోల్పోయిన పేదలు పాల్గొన్నారు.

# ఏబీసీ, ఏపీఏఏఆర్ అమలుపై రాష్ట్ర స్థాయి కార్యశాల



**అక్షరశక్తి,నల్గొండ:** అకాడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ (ఏబీసీ), ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్) అమలుపై ఒకరోజు రాష్ట్ర స్థాయి కార్యశాలను మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం (ఎంజీయూ) పరీక్షల విభాగం, నేషనల్ అకాడమిక్ డిపాజిటరీ (ఎన్ఏడీ), న్యూఢిల్లీ సహకారంతో బుధవారం విశ్వవిద్యాలయ సెమినార్ హాల్‌లో నిర్వహించింది. కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎంజీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ, విద్యార్థుల అకడమిక్ రికార్డులను డిజిటలైజ్ చేసి, సురక్షితంగా భద్రపరచడంతో పాటు నిరంతరం అందుబాటులో ఉంచేందుకు ఏబీసీ, ఏపీఏఏఆర్ విధానాలపై అవగాహన అవసరమన్నారు. జాతీయ విద్యా విధానాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ కార్యశాల దోహదపడుతుందని తెలిపారు. ఎంజీయూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి. ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఏబీసీ, ఏపీఏఏఆర్‌ల అమలు, సమర్థవంతమైన వినియోగంపై కార్యశాలలో ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. విద్యార్థులకు ఏపీఏఏఆర్ గుర్తింపు సంఖ్యల సృష్టి, డిజిలాకర్ ద్వారా అకడమిక్ సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయడం, వాటిని డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంచే విధానాలపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఎన్ఏడీ జోనల్, రాష్ట్ర సమన్వయకర్తలు డిజిటల్ అకడమిక్ రికార్డుల నిర్వహణకు సంబంధించిన విధానాలను వివరించి, పాల్గొన్న వారికి ఆచరణాత్మక మార్గదర్శకత్వం అందించారు. కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. అంజి రెడ్డి, ఎన్ఏడీ జోనల్ కోఆర్డినేటర్ రవి పాండి, రాష్ట్ర కోఆర్డినేటర్ రోహిత్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలు, స్వయంప్రతిపత్తి కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎంజీయూ పరీక్షల విభాగానికి చెందిన డాక్టర్ జి. లక్ష్మీ ప్రభ, డాక్టర్ ఎ. ప్రవళిక, డాక్టర్ ఎస్. కళ్యాణి తదితరులు హాజరయ్యారు. రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో డిజిటల్ అకడమిక్ రికార్డుల నిర్వహణను బలోపేతం చేసి, ఏబీసీ, ఏపీఏఏఆర్, ఎన్ఏడీ, డిజిలాకర్ సేవలను సమర్థవంతంగా అమలు చేయడమే కార్యశాల ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు.

# నర్సంపేటలో బిఆర్ఎస్ బంద్ ప్రశాంతం

- స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించిన ప్రజలు
- భారీ ర్యాలీ నిర్వహించిన బిఆర్ఎస్ శ్రేణులు



**అక్షరశక్తి, నర్సంపేట:** నర్సంపేటలో దివంగత నేత పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ చేపట్టిన బంద్ విజయవంతంగా ముగిసింది. అన్నివర్గాల ప్రజలు బంద్ పాటించారు. వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు బంద్ పాటించాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు నర్సంపేటలో భారీగా ర్యాలీ నిర్వహించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం తొలగింపు పాశవిక చర్య అని మండిపడ్డారు. తెలంగాణ ఉద్యమకారుడు, దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహాన్ని రాత్రికి రాత్రే తొలగించడం ద్వారా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మరోసారి తన పైశాచికత్వాన్ని నిరూపించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సంపేట గడ్డపై పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం నిలబడితేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముచ్చెమటలు పడుతున్నాయని, అందుకే పోలీసులను ఉసిగొలిపి అర్ధరాత్రి విగ్రహాన్ని తొలగించారని ఆరోపించారు. పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపు దుర్మార్గం, తెలంగాణ సమాజం సహించదని హెచ్చరించారు. అధికార అహంతో పెద్ది విగ్రహాన్ని కూల్చగలిగారే కానీ నర్సంపేట ప్రజల హృదయాల్లో పెద్ది పై ఉన్న ఆత్మీయతను చెరిపి వేయలేరని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకొని పెద్ది విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బందుకు సహకరించిన నియోజకవర్గ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్, జెడ్పి వైస్ చైర్మన్, మాజీ ఒడిసిఎంఎస్ చైర్మన్, నియోజకవర్గ కోఆర్డినేటర్, జిల్లా నాయకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పట్టణ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పిటిసిలు, నియోజకవర్గ క్లస్టర్ బాధ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, మరియు పట్టణ పార్టీ బాధ్యులు, మహిళ నాయకులు, యూత్ నాయకులు, పట్టణ కమిటీ బాధ్యులు, సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, నియోజకవర్గ పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.









# కొండా సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం: మల్లు రవి

**అక్షరశక్తి, ఢిల్లీ:** మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్ఠను దెబ్బతీసేలా సుస్మిత వ్యాఖ్యలు ఉన్నాయని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి తీవ్రంగా ఖండించారు. పార్టీకి సంబంధించిన లక్ష్మణ రేఖను ఎవరు అతిక్రమించినా చర్యలు తప్పవని మల్లు రవి స్పష్టం చేశారు. కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై పూర్తి సమాచారాన్ని తెప్పించుకున్న తర్వాత ఆమెపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. గతంలోనూ షబ్బీర్ అలీ, కొండా మురళీ మధ్య వివాదం తలెత్తినప్పుడు వారితో చర్చించి సమస్యను పరిష్కరించినట్లు మల్లు రవి తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ నేత రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు. క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ నాయకుల మధ్య తలెత్తిన వివాదాలను పరిష్కరించినట్లు మల్లు రవి తెలిపారు. ఈ క్రమంలోనే కొండా సుస్మిత వ్యవహారంపై తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షీ నటరాజన్ ఆరా తీశారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని పీసీసీ చీఫ్‌ను కోరారు. దీంతో సుస్మితపై కాంగ్రెస్ అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# ఆర్ట్స్ కళాశాలలో వన మహోత్సవం



**అక్షరశక్తి,హనుమకొండ:** సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుకరి జ్యోతి మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. కళాశాల ఆవరణను పచ్చదనంతో నింపేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ రిజిస్ట్రార్ శ్రీలత, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ శ్రీదేవి, శ్రీలత, రమేష్, అంజన్‌రావు, శ్రీధర్‌కుమార్, డాక్టర్ ఆదిరెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులపై అవగాహన పెంచాలి

**అక్షరశక్తి,కాజీపేట:** షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర ద్వితీయ మహాసభను బుధవారం కాజీపేట రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత, కార్మికరత్న డా. యమడాల హనుకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎం. భార్గవ్, హైకోర్టు ప్రభుత్వ న్యాయవాది, బార్ కౌన్సిల్ సభ్యుడు బైరాపాక జయాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎం. భార్గవ్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు తప్పనిసరిగా లేబర్ కార్డు తీసుకోవాలని, దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్మికులకు ఏదైనా సహాయం అవసరమైతే నేరుగా లేబర్ కార్యాలయాన్ని సంప్రదించాలని, కార్మికుల సంక్షేమం కోసం అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. బైరాపాక జయాకర్ మాట్లాడుతూ కార్మికులకు న్యాయపరమైన సూచనలు, సలహాలు అందిస్తూ రానున్న రోజుల్లో మరింత మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు డా. యమడాల హనుకాంత్ మాట్లాడుతూ అసంఘటిత, సంఘటిత రంగాల కార్మికులతో పాటు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాదసి, సులోచన, దాసరి అనిత, గిన్నారపు మంజుల, ఇందిరా, డక్క ప్రభాకర్, అజాజ్, చందు, ఈశ్వరమ్మ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



# నగరాన్ని క్లీన్, గ్రీన్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు

**అక్షరశక్తి, హనుమకొండ:** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ *జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయం ఛాంబర్ నుండి...గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ )పై మున్సిపల్ అధికారులు, ఎమ్మెస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ , ఐ ఐ టీ చెన్నై, శ్రీచర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ చెన్నై సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.
కార్పొరేషన్ పరిధిలో ఘన వ్యర్థాల (తడి, పొడి చెత్త వ్యర్థాల)నిర్వహణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులు, సంస్థల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేకాధికారి చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ తడి, పొడి చెత్త వ్యర్థాల నిర్వహణలో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మెరుగైన నిర్వహణ కోసం తగిన ప్రణాళికలను రూపొందించాలన్నారు. పెరుగుతున్న ఘన వ్యర్థాల సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం చూపేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.
ఇళ్ల నుండి వచ్చే చెత్తను తడి, పొడి వ్యర్థాలుగా వేరు చేసి సేకరించడం ద్వారా వ్యర్థాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టవచ్చన్నారు ప్రజలకు ఘన వ్యర్థాల



నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. ఘన వ్యర్థాల నిర్వహణపై ప్రజల సహకారం,మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు సమన్వయంతో పనిచేస్తే నగరం క్లీన్, గ్రీన్ సిటీగా మారుతుందన్నారు. ఘనవిర్థాల నిర్వహణపై సరైన ప్రణాళిక పరిశోధనతో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ను రాబోయే ఐదు సంవత్సరాలలో స్వచ్ఛత నగరంగా మార్చేందుకు కృషి చేయాలన్నారు.
గ్రేటర్ వరంగల్ నగరంలో నిర్వహణపై పరిష్కార చర్యలకు పరిశోధన, నిర్వహణ సహాయ సహకారాలు అందిస్తూ .GWMC స్వచ్ఛ సిటీ గా మార్చుటకు రాబోయే 5 సంవత్సరాలలో చేయూత అందించుటకు MS స్వామినాథన్ రీసర్చ్ ఫౌండేషన్ ఐఐటీ మద్రాస్, శ్రీచర్ ఇన్స్టిట్యూట్ అఫ్ హైయర్ ఎడ్యుకేషన్ చెన్నై ముందుకు రావటం జరిగింది. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, సీఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఎమ్మెస్ స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ ప్రతిభా గణేషన్, రాజమోహన్ రెడ్డి, సంస్థల ప్రతినిధులు హర్షవర్ధన్, అరవింద్, గౌతమ్ కృష్ణ , ఇందుమతి, తానీషి పొన్నమ్మ, అన్నపూర్ణ కశ్యప్, ప్రీతి, దివ్య, మాలవి, తదితరులు పాల్గొన్నారు.






# సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలి

**అక్షరశక్తి, హనుమకొండ క్రైమ్:** సైబర్ నేరాలపై ప్రజలు, విద్యార్థులు, యువతలో అవగాహన కల్పించే లక్ష్యంతో "సురక్షా కా తిరంగా" కార్యక్రమంలో భాగంగా కాకతీయ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ అవేర్నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 200 మంది విద్యార్థులు, ఉద్యోగులు, ఇతరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న డిజిటల్ అరెస్ట్, పెట్టుబడుల మోసం, రిమోట్ యాక్సెస్ యాప్, బ్యాంక్-కేవైసీ నవీకరణ వంటి మోసాలపై పోలీసులు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు ఇవ్వకూడదని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాలు, లింక్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్వర్డ్లు వంటి రహస్య బ్యాంకింగ్ వివరాలను ఎవరికీ వెల్లడించరాదని, పోలీసులు, బ్యాంకు లేదా ప్రభుత్వ అధికారులు ఫోన్ ద్వారా వాటిని అడగరని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫోన్ చేయాలని లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం సైబర్ భద్రతపై అవగాహన కల్పించేందుకు క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓ ఎం. వెంకటరమణ, సీఐ రవికుమార్, ఎస్ఐలు శ్రావణి, చరణ్, హెడ్ కానిస్టేబుల్ పి. శ్రీనివాస్, కానిస్టేబుల్ జాహురుద్దీన్, స్పార్క్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ పరిరక్షణకు కృషి చేస్తా

**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



**అక్షరశక్తి, వరంగల్:** వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పరిరక్షణకు ఎల్లవేళలా కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఇ.వి. శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉద్యోగులు, పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. జీవో 97పై ఉన్న అపోహలను నివృత్తి చేసేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి శాఖలో విలీనం చేసి, స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావడం వల్ల పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థకు నష్టం జరుగుతుందని ప్రతినిధులు వివరించారు. జీవో 97ను రద్దు చేసి, పాలిటెక్నిక్ విద్య, కళాశాలల భూములు ప్రైవేటీకరణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.
జీవో 97కు సంబంధించిన పూర్తి విధివిధానాలను తెలుసుకుని పాలిటెక్నిక్ కళాశాలలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటానని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రూ.28 కోట్లు ప్రభుత్వం నుంచి మంజూరు చేయించి, 70 ఏళ్ల చరిత్ర కలిగిన పాలిటెక్నిక్ కళాశాల భవన పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేశానని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయిస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి మేకల అక్షయ్ కుమార్, ఉపాధ్యక్షులు బొద్దిరెడ్డి సతీష్ రెడ్డి, ఇమ్మడి శ్రీనివాస్, ఈసీ సభ్యుడు దొడ్డిపల్లి కుమార్, విద్యార్థులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ వర్సిటీ అభివృద్ధికి గత తరం ఉద్యోగులే బలమైన పునాదులు




**అక్షరశక్తి, కేయూ క్యాంపస్:** గత తరం ఉద్యోగులు తమ అంకిత భావం, క్రమశిక్షణ, నిబద్ధతతో కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని, వారి స్ఫూర్తిని నేటి తరం ఉద్యోగులు కొనసాగించాలని వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ 50వ వ్యవస్థాపక దినోత్సవం, స్వర్ణోత్సవ వేడుకలను బుధవారం సెనెట్ హాల్లో రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ, వందేళ్ల చరిత్ర కలిగిన విశ్వవిద్యాలయాలతో అకడమిక్, పరిశోధనా రంగాల్లో కాకతీయ విశ్వవిద్యాలయం పోటీ పడటం గర్వకారణమన్నారు. సుమారు రూ.140 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రయోగశాలలు, గ్రంథాలయాల ఆధునికీకరణ చేపడుతున్నామని, రాబోయే ఏడాదిలో వాటి ఫలితాలు స్పష్టంగా కనిపిస్తాయని తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఉస్మానియా విశ్వవిద్యాలయానికి సమానంగా రూ.400 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. పరిశోధనకు మరింత ప్రోత్సాహం అందించేందుకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తామని, ఆర్యూఎస్ఏ నిధులతో 74 మంది ప్రాజెక్ట్ ఫెలోస్, 42 మంది రీసెర్చ్ అసోసియేట్స్, ఐదు పరిశోధనా కేంద్రాల ద్వారా నాణ్యమైన పరిశోధనకు ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు. విద్యార్థులను పరిశ్రమలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు కేహబ్ను మరింత అభివృద్ధి చేసి టీహబ్తో అనుసంధానం చేసే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పరీక్షల విభాగం, పరిపాలనా వ్యవస్థను డిజిటలైజ్ చేస్తున్నామని, ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. జర్మనీ పర్యటనలో పలు విశ్వవిద్యాలయాలతో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు అవకాశాలు ఏర్పడ్డాయని, విద్యార్థులు, అధ్యాపకుల మార్పిడి, సంయుక్త పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూనే విశ్వవిద్యాలయ భవిష్యత్ అభివృద్ధి, ప్రగతిపై దృష్టి పెట్టాలని, రాజకీయాలకు అతీతంగా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. సెప్టెంబర్ మొదటి వారంలో పద్మశ్రీ డాక్టర్ పద్మజా రెడ్డి ఆధ్వర్యంలో 'కాకతీయం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, డీన్లు, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, ఉద్యోగ సంఘాల బాధ్యులు, బోధనా, బోధనేతర సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.